KANCHARLA
# మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక

## తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
| --- | --- | --- | --- | --- |
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

మంగళవారం 19 మే 2026 పేజీ : 1

# బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు!

- పకడ్బందీగా పోక్సో కేసు విచారణ
- రంగంలోకి ప్రత్యేక అధికారి డీసీపీ రతిరాజ్
- నిందితుడికి జీవిత ఖైదు పడే అవకాశం



04

## జస్టిస్ మాధవీదేవిపై దుష్ప్రచారం.. వ్యక్తి అరెస్ట్!

## చెట్ల నరికివేతపై సుప్రీం స్టే!

- కేబీఆర్ పార్క్ పరిసరాల్లో, ఎకో సెన్సిటివ్ జోన్‌లో నిర్మాణాలకు బ్రేక్
- ఫ్లై ఓవర్ల పనులకు తాత్కాలిక ఆటంకం



వివరాలు 3లో..



06

## ఈ-గవర్నన్స్‌తోనే మెరుగైన సేవలు!

## మ్యూజియాలు జ్ఞాన కేంద్రాలు!



- వారసత్వ సంపద రక్షణ మనందరి బాధ్యత
- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి

04



## విపత్తులపై తెలంగాణ అప్రమత్తం!

- నెక్లెస్ రోడ్‌లో భారీ వరద మాక్ డ్రిల్
- పరిశీలించిన మంత్రి పొంగులేటి
- ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు లాంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ వరద మాక్ డ్రిల్‌ను సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.

వివరాలు 4లో..

# నక్సలిజం రహిత దేశమే లక్ష్యం!

## తెలంగాణ పోలీసులకు అమిత్ షా సన్మానం

- ఛత్తీస్‌గఢ్‌లో ఘనంగా కార్యక్రమం
- మూడు తరాల పీడకలకు ముగింపు



దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం లేని సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో మావోయిస్టుల నిర్మూలనకు అసాధారణ కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు బీ. శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ సుమతితో పాటు ప్రత్యేక నిఘా బృందాన్ని అమిత్ షా శాలువాలతో సత్కరించి అభినందించారు. మార్చి 31, 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే కాలపరిమితితో ముందుకు సాగుతున్నామని, ఇందులో భాగంగానే బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఒక చారిత్రాత్మక మైలురాయి అని హోం మంత్రి కొనియాడారు.

వివరాలు 2లో..

# నక్సలిజం రహిత దేశమే లక్ష్యం!

- తెలంగాణ పోలీసులకు అమిత్ షా సన్మానం
- ఛత్తీస్‌గఢ్‌లో ఘనంగా కార్యక్రమం
- మూడు తరాల పీడకలకు ముగింపు



**జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), మే 18 (మనసులో మాట ప్రతినిధి):** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో సోమవారం నాడు మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

### తెలంగాణ అధికారులకు సత్కారం

ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు, మాజీ డీజీపీ బీ. శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్, గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా శాలువాలతో సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు.

### కాలపరిమితితో సాధించిన విజయం

ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మార్చి 31, 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. తాము ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది సందేహాలు వ్యక్తం చేశారని, కానీ స్పష్టమైన ప్రణాళిక, పక్కా వ్యూహంతో ముందుకు సాగి బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి పొందిందని కొనియాడారు.

### జవాన్ల త్యాగాలకు దక్కిన గౌరవం

1970వ దశాబ్దం నుంచి దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం వల్ల తీవ్ర రక్తపాతం, అభివృద్ధి కుంటుపడటం లాంటి దుష్పరిణామాలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ చారిత్రాత్మక విజయం సాధ్యమైందని స్పష్టం చేశారు. భద్రతా దళాల సమన్వయం, పట్టుదలతోనే ఈ అసాధ్యమైన లక్ష్యాన్ని సాకారం చేసుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్వగృహ ప్లాట్లకు భారీ డిమాండ్!

**తొర్రూర్‌లో గజం భూమి రూ. 45,500**

**బహదూర్‌పల్లిలో రూ. 40,500 పలికిన ధర**

**ప్రభుత్వానికి రూ. 83 కోట్ల ఆదాయం**

**హైదరాబాద్, మే 18 (మనసులో మాట ప్రతినిధి):** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎలాంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెందిన 85 ప్లాట్లకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని తొర్రూర్, కుర్మల్ గూడ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని ఈ ప్లాట్ల కోసం బిడ్డర్లు పోటీ పడ్డారు. పెద్దఅంబర్‌పేటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 83 కోట్ల ఆదాయం వచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, ఆదిభట్ల ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న తొర్రూర్ లేఅవుట్‌లో ప్లాట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడ చదరపు గజం కనీస ధర రూ. 25 వేలుగా నిర్ణయించగా, వేలంలో గరిష్టంగా రూ. 45,500 ధర పలికింది. సగటున గజానికి రూ. 32,500 లభించింది. తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకోవడానికి బిడ్డర్లు దాదాపు ఇరవై సార్లు రేట్లు పెంచడం ఇక్కడి భూములకున్న డిమాండ్‌ను తెలియజేస్తోంది. విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న కుర్మల్ గూడలో గజం కనీస ధర రూ. 20 వేలు కాగా, గరిష్టంగా రూ. 27,500 పలికింది. అలాగే ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌పల్లిలో గజం కనీస ధర రూ. 27 వేలు కాగా, వేలంలో గరిష్టంగా రూ. 40,500 ధర లభించింది. ఇక్కడ సగటున రూ. 33,800 చొప్పున బిడ్డర్లు ప్లాట్లను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పారదర్శకంగా జరిగిన ఈ వేలంలో దాదాపు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రివర్గంలోకి ఈటల..?

**తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం**

**ఢిల్లీ వేదికగా మారుతున్న సమీకరణాలు**

**బండి సంజయ్ కుమారుడి వివాదం నేపథ్యంలో చర్చ**



**న్యూఢిల్లీ / హైదరాబాద్, మే 18 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతోంది.

### మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ మార్పులు జరిగే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు పరిశీలనలోకి వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్‌గిరి ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి!

- హనుమకొండలో ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు
- పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై కలెక్టర్ల సమీక్ష




**హనుమకొండ, మే 18:** త్వరలో జరిగే బక్రీద్ పండుగను శాంతియుతంగా, పరస్పర గౌరవ భావాలతో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా చేపట్టాల్సిన శాంతిభద్రతల చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఈద్గాల వద్ద సౌకర్యాల ఏర్పాటుపై సమీక్షించారు.

### వదంతులు నమ్మొద్దు.. సీపీ హెచ్చరిక

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ నగరాల్లో ప్రతి పండుగను ప్రజలు సామరస్యంతో జరుపుకుంటారని, అదే స్ఫూర్తితో బక్రీద్ పండుగను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంతువులకు పశుసంవర్ధక శాఖ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పశువుల వ్యర్థాలను రోడ్లపై వేయకుండా పరిశుభ్రత పాటించాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### అధికారుల సమన్వయం అవసరం

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబాని ఖుస్రో పాషా, డీసీపీలు అంకిత్ కుమార్, ధారా కవిత, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి పాల్గొన్నారు. వారితో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏసీపీలు, ఆర్డీవోలు, శాంతి కమిటీ అధ్యక్షులు డాక్టర్ అనిస్ సిద్ధిక్వి, సభ్యులు, ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు.

# బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు!

- పకడ్బందీగా పోక్సో కేసు విచారణ
- రంగంలోకి ప్రత్యేక అధికారి డీసీపీ రితిరాజ్
- నిందితుడికి జీవిత ఖైదు పడే అవకాశం



**హైదరాబాద్, మే 18:** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో కఠినమైన సెక్షన్‌ను అదనంగా చేర్చారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై బీఎన్ఎస్ 64(2)(జెడ్) సెక్షన్‌ను దర్యాప్తు అధికారులు జత చేశారు. దీని ప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు పైగా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. ఈ నెల 8న మైనర్ బాలికపై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో తీవ్ర హైడ్రామా మధ్య పోలీసులు కేవలం బీఎన్ఎస్ సెక్షన్లు 74, 75 తో పాటు పోక్సో చట్టం 2012 లోని సెక్షన్ 11 రెడ్ విత్ 12 కింద మాత్రమే కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. అయితే, పోలీసులు బాధితురాలితో నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి.

### దర్యాప్తు అధికారిగా డీసీపీ రితిరాజ్

ఈ ఘటనపై అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో.. సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా ప్రభుత్వం నియమించింది. వెంటనే రంగంలోకి దిగిన ఆమె సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగ్మూలాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

### బాధితురాలితో భేటీ.. మారిన సెక్షన్లు

మంగళవారం డీసీపీ రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెను కలిశారు. పోక్సో కేసు దర్యాప్తు నిబంధనల ప్రకారం ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు, బాధితురాలు చెప్పున్న వివరాలకు పొంతన లేకపోవడాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలి ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6 పరిధిలోకి వస్తాయని నిర్ధారించారు. బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నందున ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తోంది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ, ఆ మేరకు కేసులో సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి 20 ఏళ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలు ఉన్నాయి.

# జస్టిస్ మాధవీదేవిపై దుష్ప్రచారం.. వ్యక్తి అరెస్ట్!

- హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియాలో పోస్టులు
- చార్మినార్ పోలీసులకు రిజిస్ట్రార్ ఫిర్యాదు

**హైదరాబాద్, మే 18 (మనసులో మాట):** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి సాయి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నేపథ్యంలో.. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ. మాధవీదేవిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన దామోదర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బండి సంజయ్ కుమారుడికి బెయిల్ మంజూరు చేస్తే, తన భర్తకు చైర్మన్ పదవి ఇస్తారంటూ సదరు వ్యక్తి అసత్య ఆరోపణలు చేస్తూ ప్రచారం సాగించాడు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు రిజిస్ట్రార్ బీ.ఎస్. చిరంజీవి చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితుడు దామోదర్‌ను అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తిపై జరిగిన ఈ దుష్ప్రచారంపై హైకోర్టు ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం స్టే!

### ఎకో సెన్సిటివ్ జోన్‌లో నిర్మాణాలకు బ్రేక్

### ఫ్లై ఓవర్ల పనులకు తాత్కాలిక ఆటంకం

**న్యూఢిల్లీ, మే 18 (మనసులో మాట):** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.



కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ల నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కే. వివేక్ రెడ్డి కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల జరిగే పర్యావరణ నష్టాన్ని వివరించిన ఆయన, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు చెట్ల నరికివేతపై స్టే ఇస్తూ, తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వుల వల్ల ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో చేపట్టదలచిన ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

# అప్పు కోసం కన్యాశుల్కం తరహా పెళ్లి!

### 18 ఏళ్ల యువతిని పెళ్లాడిన 45 ఏళ్ల నేత

### మరుసటి రోజే ప్రియుడితో పరారైన వధువు

### మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు

**జనగామ, మే 18 (మనసులో మాట):** జనగామ జిల్లా బచ్చన్నపేటలో నాటి కన్యాశుల్కాన్ని తలపించే ఘోరమైన ఘటన చోటుచేసుకుంది. 18 ఏళ్ల యువతికి 45 ఏళ్ల వ్యక్తితో సవతి తల్లి, తండ్రి బలవంతంగా వివాహం జరిపించిన వైనం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. బచ్చన్నపేటకు చెందిన బిఆర్ఎస్ నేత ప్రశాంత్ రెడ్డి ఇటీవల వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యాడు. అదే గ్రామానికి చెందిన దంపతులకు ఆయన రూ. 20 లక్షల అప్పు ఇచ్చాడు. ఆ అప్పును వారు తిరిగి చెల్లించలేకపోవడంతో, వారి కుమార్తెను తనకు ఇచ్చి పెళ్లి చేయాలంటూ ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడి తెచ్చాడు. అవసరమైతే ఎదురుకట్నం కూడా ఇస్తానంటూ కొంత డబ్బు ఆశ చూపాడు. దీంతో సవతి తల్లి, తండ్రి కలిసి తమ 18 ఏళ్ల కుమార్తెను బలవంతంగా ఒప్పించి, ప్రశాంత్ రెడ్డితో పెళ్లి జరిపించారు. అయితే, ఆ యువతి అప్పటికే మరో యువకుడిని ప్రేమించింది. దీంతో వివాహం జరిగిన మరుసటి రోజే ఆమె తన ప్రియుడితో కలిసి పరారైంది. స్నేహితుల సహాయంతో ప్రశాంత్ రెడ్డి బారి నుంచి తప్పించుకున్న బాధితురాలు.. హైదరాబాద్‌లోని మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ దారుణ ఘటనపై తక్షణమే పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను మహిళా కమిషన్ ఆదేశించింది. బాధ్యులపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు.

# గద్వాలలో పట్టుచీరల దొంగల అరెస్ట్!

### కస్టమర్లలా నటించి చీరల అపహరణ

### ఆటోను వెంబడించి పట్టుకున్న స్థానికులు

### ఇద్దరు మహిళలు, డ్రైవర్ పోలీసులకు అప్పగింత

**జోగులాంబ గద్వాల, మే 18 (మనసులో మాట):** గద్వాల పట్టణంలోని కిష్టారెడ్డి బంగ్లా వద్ద పట్టుచీరల దొంగతనం కలకలం రేపింది. ఎప్పుడూ ప్రజలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలోని ఓ పట్టుచీరల దుకాణంలోకి సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు కస్టమర్ల మాదిరిగా వచ్చారు. దుకాణ సిబ్బంది కళ్లుగప్పి విలువైన పట్టుచీరలను అపహరించారు. అనంతరం తాము ముందుగానే సిద్ధం చేసుకున్న ఒక ఆటోలో అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. ఈ దొంగతనాన్ని గమనించిన స్థానిక వ్యాపారులు, ప్రజలు వెంటనే అప్రమత్తమై ఆ ఆటోను వెంబడించారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆటోను అడ్డుకుని, అందులో ఉన్న ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పట్టణ రెండో సబ్ ఇన్స్పెక్టర్ జహంగీర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టుబడిన ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన వారు ఏ ప్రాంతానికి చెందినవారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# మోండా మార్కెట్‌లో దారుణ హత్య!

### మద్యం మత్తులో స్నేహితుడి ఘాతుకం

### నరసింహులు అనే వ్యక్తి హతం




**సికింద్రాబాద్, మే 18 (మనసులో మాట):** సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. మద్యం మత్తులో తలెత్తిన చిన్నపాటి వివాదం ఒకరి ప్రాణం తీసే వరకు వెళ్లింది. తనతో పాటే కూర్చొని మద్యం సేవించిన స్నేహితుడినే ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్‌టీపీసీ భవనంలోని ఐదో అంతస్తులో ఈ ఘటన చోటుచేసుకుంది. నిన్న రాత్రి నరసింహులు అనే వ్యక్తి, అతని స్నేహితుడు కలిసి అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఒక విషయంలో తీవ్రమైన గొడవ మొదలైంది. మద్యం మత్తులో ఉన్న స్నేహితుడు అక్కడే ఉన్న మద్యం సీసాతో నరసింహులుపై విచక్షణారహితంగా దాడి చేశాడు.

### ఘటన స్థలంలోనే మృతి

తలకు బలంగా గాయం కావడంతో నరసింహులు ఘటన స్థలంలోనే రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# రాష్ట్రంలో ఇంధన, గ్యాస్ సరఫరా స్థిరం!

**పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు: ఓఎంసీలు**

**ఈ నెలలోనే పెరిగిన ఇంధన అమ్మకాలు**

**సిలిండర్ల డెలివరీకి ఓటీపీ తప్పనిసరి**

**హైదరాబాద్, మే 18 (మనసులో మాట ప్రతినిధి):** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ సంస్థలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఓఎంసీల రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధి నమోదైంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయడం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర సిలిండర్లను డెలివరీ చేశామని, ఈ సీజన్‌కు ఇది సాధారణమేనని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా సిలిండర్లు బుక్ చేసుకోవాలని వినియోగదారులను కంపెనీలు కోరాయి.

**ఓటీపీ విధానం తప్పనిసరి**

ఎల్పీజీ సిలిండర్ల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత విధానాన్ని (డెలివరీ అథెంటికేషన్ కోడ్ – డీఏసీ) అనుసరించాలని కంపెనీలు కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఈ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. దీనిని వంద శాతానికి చేర్చేందుకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి. నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని ఓఎంసీలు విజ్ఞప్తి చేశాయి.

# నిజామాబాద్‌కు రేవంత్ పంగనామాలు!

**ఎంపీ అర్వింద్**

**నిజామాబాద్, మే 18 (మనసులో మాట):** నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. నగరానికి ఇచ్చిన ఔటర్ రింగ్ రోడ్, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ హామీలు నెరవేరకపోవడంతో టీపీసీసీ చీఫ్ తలెత్తుకోలేకపోతున్నారని విమర్శించారు. సోమవారం నిజామాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కడానికే ముఖ్యమంత్రి ఈ జిల్లాకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని మహేష్ కుమార్ గౌడ్ ఈ జిల్లాలో తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్ (ఇందురు) ప్రజలను మోసం చేస్తే వారే తగిన బుద్ధి చెబుతారని అర్వింద్ హెచ్చరించారు. దేవుళ్లనే మోసం చేసిన రేవంత్ రెడ్డికి ప్రజలను మోసం చేయడం ఒక లెక్క కాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండబద్దలు కొట్టారు. ఇప్పటివరకు నగరంలో కనీసం 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదని స్పష్టం చేశారు. ఈ పనుల కోసం రూ. 162 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే కేటాయించిందని వివరించారు.రాహుల్ గాంధీ 2039 వరకు ప్రధాని కాలేరని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని అర్వింద్ గుర్తు చేశారు. అంటే రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే అవకాశం లేదని, దేశంలో ఇంకో పదేళ్ల పాటు బీజేపీ ప్రభుత్వమే ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నట్లేనని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బదులుగా కోమటిరెడ్డి లాంటి నిజాయితీ గల వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి సూచించారు.

# విపత్తులపై తెలంగాణ అప్రమత్తం!

- నెక్లెస్ రోడ్‌లో భారీ వరద మాక్ డ్రిల్
- పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు



**హైదరాబాద్, మే 18 (మనసులో మాట):** ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు లాంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ వరద మాక్ డ్రిల్‌ను సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.

**అత్యంత కీలకం 'గోల్డెన్ అవర్'**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట అత్యంత కీలకమని, ఆ సమయంలో తీసుకునే చర్యలే ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు, వరదలు, ఆకస్మిక ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం కోసం ఈ మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 1908 నాటి హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి గోదావరి ఉకృష్ణా వరదలను ప్రస్తావిస్తూ.. అప్రమత్తత లేకపోతే ఎంతటి నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, అడవుల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

**రెస్క్యూ ఆపరేషన్ల ప్రత్యక్ష ప్రదర్శన**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి రెస్క్యూ కార్యకలాపాలను పరిశీలించారు. విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా అధికారులను అభినందించారు. ఇవన్నీ కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగమేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బెల్ పాల్గొన్నారు. పోలీస్, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు.

# మ్యూజియాలు జ్ఞాన కేంద్రాలు

- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి
- పర్యాటక గైడ్‌ల శిక్షణకు రూ. 5 కోట్లు కేటాయింపు
- వారసత్వ సంపద రక్షణ మనందరి బాధ్యత



**హైదరాబాద్, మే 18 (మనసులో మాట ప్రతినిధి):** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తుచేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్స్‌లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, తెలంగాణలోని 'పరమార జగద్దేవుని శాసనాలు', 'స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం' అనే పుస్తకాలతో పాటు ప్రత్యేక బ్రోషర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి అన్నీ వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని చెప్పారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని కాలంలోనే మన పూర్వీకులు అద్భుతమైన కట్టడాలను నిర్మించారని కొనియాడారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు.

**గైడ్‌ల శిక్షణకు రూ. 5 కోట్లు**

చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ మాన్యుమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ శాలినీ భూపాల్, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తదితరులు హాజరయ్యారు

# శంకరమ్మకు ఘన సన్మానం!

- మహిళా కమిషన్ సభ్యురాలికి సత్కారం
- విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో కార్యక్రమం
- రూ. 500 కోట్ల నిధుల డిమాండ్



**ఎల్బీనగర్, మే 18 (మనసులో మాట):** నూనూగు మీసాల వయసులోనే తెలంగాణ కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మకు తగిన గౌరవం దక్కింది. ఆమెను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి విశ్వకర్మ జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగ చారి అభినందనలు తెలిపారు. సోమవారం హయాత్‌నగర్‌లోని కాసోజు శంకరమ్మ నివాసంలో విశ్వకర్మ జేఏసీ ప్రతినిధులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. మహిళా కమిషన్ సభ్యురాలిగా నూతనంగా ఎన్నికైన కాసోజు శంకరమ్మ, వెంకటాచారిలను జేఏసీ చైర్మన్ పాండురంగ చారి, వైస్ చైర్మన్ మారోజు రామాచారి, రాష్ట్ర సలహాదారు అక్కనపల్లి లక్ష్మణాచారి, కోశాధికారి మోత్కూరి మల్లాచారి గౌరవించారు. ఈ సందర్భంగా శంకరమ్మ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ప్రతి ఒక్కరికీ తెలంగాణ ఉద్యమ వందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాండురంగ చారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని అమలు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమిని వెంటనే కేటాయించి, అమరవీరులను గుర్తించాలన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌ను అధికారికంగా 'తెలంగాణ జాతిపిత'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి

ప్రపంచీకరణ వల్ల కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకారుల వంటి పంచ వృత్తులు దెబ్బతిని, కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రూ. 500 కోట్ల నిధులు కేటాయించి విశ్వకర్మలను ఆదుకోవాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి విశ్వకర్మకు నెలకు రూ. 5 వేల సామాజిక పెన్షన్ అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ప్రభంజనం ప్రతినిధులు బొంగు వెంకటేష్ గౌడ్, తెలంగాణ వెంకన్న, మహిళా నాయకులు వడ్ల అరుణ, ఎన్. రాజ్యలక్ష్మి, రంగారెడ్డి జిల్లా నాయకులు కొంపోజు శ్రీకాంతాచారి పాల్గొన్నారు.

# క్రీడా వారోత్సవాలు ప్రారంభం!

### ఎల్బీ స్టేడియంలో మంత్రుల జుంబా డాన్స్
### ఐదు కిలోమీటర్ల వాకథాన్ ప్రారంభం
### మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు




**హైదరాబాద్, మే 18 (మనసులో మాట):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మే 18 నుండి 23 వరకు యువజన, క్రీడా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ప్రత్యేక జుంబా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

### వాకథాన్‌ను ప్రారంభించిన మంత్రులు

ఈ వారోత్సవాల సందర్భంగా ఎల్బీ స్టేడియం వేదికగా ఏర్పాటు చేసిన ఐదు కిలోమీటర్ల వాకథాన్‌ను మంత్రులు, ఉన్నతాధికారులు జెండా ఊపి ప్రారంభించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఈ ప్రగతి ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. వారం రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విభిన్న క్రీడా పోటీలు, యువజన చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

# కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు!

### కొడంగల్ సబ్ డివిజన్ పరిధిలో అధికారుల పర్యటన
### రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశం
### ధాన్యం రవాణా వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి

**కొడంగల్ నియోజకవర్గం, మే 18 (మనసులో మాట):** వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా కలిసి కొడంగల్ సబ్ డివిజన్ పరిధిలోని పలు వరి కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రైస్ మిల్లులను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంరాస్‌పేట్ గ్రామం, బురన్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాలను వారు తనిఖీ చేశారు. అనంతరం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలోని కొనుగోలు కేంద్రం, గోదామును సందర్శించి ధాన్యం నిల్వలు, రవాణా, కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే దుద్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం గ్రామంలో ఉన్న రైస్ మిల్‌ను పరిశీలించి అక్కడి నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చూడడం, గోదాముల నిర్వహణను సక్రమంగా ఉంచడంపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.

### మధ్యవర్తుల జోక్యం లేకుండా చర్యలు

జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాల సహకారం అందిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మధ్యవర్తుల జోక్యం లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ధాన్యం రవాణాలో జాప్యాన్ని నివారించడం వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తాము ఇప్పటికే డీఎస్పీ స్థాయి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారులకు వినికిడి పరికరాల పంపిణీ!

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా అందజేత
### ఏడుగురు బధిర పిల్లలకు లబ్ధి



**మహబూబ్‌నగర్, మే 18 (మనసులో మాట):** ఆర్‌బీఎస్‌కే, డీఈఐసీ అధికారులు గుర్తించిన ఏడుగురు వినికిడి లోపం ఉన్న పిల్లలకు (బధిరులకు) జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం తన చాంబర్‌లో వినికిడి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినికిడి లోపం ఉన్న చిన్నారులు సమాజంలో ఇతర పిల్లలతో సమానంగా ఎదగడానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఇలాంటి పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్కను చంపిన తమ్ముడు!

### సూర్యాపేట జిల్లా తుమ్మలపహాడ్‌లో దారుణం
### కత్తితో విచక్షణారహితంగా దాడి చేసిన సురిగి సైదులు
### గతంలోనే బైండోవర్ చేసినా మారని తీరు



**సూర్యాపేట, మే 18 (మనసులో మాట):** భూ తగాదాల కారణంగా ఒక తమ్ముడు తన సొంత అక్కపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘోర ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మలపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురిగి సైదులుకు, అతని సోదరి అంజమ్మకు మధ్య కొంతకాలంగా భూమి విషయమై గొడవలు జరుగుతున్నాయి.

### గతంలోనే పోలీస్ కేసు

ఈ భూ వివాదానికి సంబంధించి గతంలోనే ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పట్లో ఇరువర్గాలను పిలిపించి బైండోవర్ చేసిన పోలీసులు, గొడవలకు దిగవద్దని గట్టిగా హెచ్చరించారు. అయినప్పటికీ సైదులు మనసులో కక్ష పెంచుకున్నాడు. అక్కను అడ్డు తప్పిస్తేనే ఆ భూమి పూర్తిగా తన సొంతమవుతుందని పథకం వేశాడు. సోమవారం నాడు అంజమ్మ కూలి పనికి వెళ్తుండగా మార్గమధ్యంలో సైదులు ఆమెను అడ్డుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆత్మకూరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు!

**కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా పంపిణీ**

**తొలి విడత కార్డుల అందజేత**



**నిజామాబాద్, మే 18 (మనసులో మాట):** జిల్లాలో పని చేస్తున్న గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు 2026 – 2028 కాల వ్యవధి కోసం మంజూరైన తొలి విడత అక్రిడిటేషన్ కార్డులను జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం లాంఛనంగా అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏ. నర్సింలు, భూపతి, సాయిప్రసాద్, రాందయానంద్, శ్రీకాంత్, గౌస్, మాజీద్ తదితరులు కలెక్టర్ చేతుల మీదుగా ఈ కార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ పద్మశ్రీతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. తండ్రి మృతి!

**చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న కుమారుడు**

**జనగామ జిల్లా రఘునాథపల్లిలో దారుణం**

**బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ట్రాక్టర్**




**జనగామ, మే 18 (మనసులో మాట):** జనగామ జిల్లా రఘునాథపల్లిలో సోమవారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో తండ్రి అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన కుమారుడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమళ్ల గ్రామానికి చెందిన అలావత్ బాలాజీ (49) తన కుమారుడు నరేష్‌తో కలిసి సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రాఘవాపురం బయల్దేరారు. వీరు హనుమకొండ – హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక ట్రాక్టర్ వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది.

**అక్కడికక్కడే ప్రాణ నష్టం**

ఈ ఘోర ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాలాజీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతని కుమారుడు నరేష్ శరీరానికి బలమైన గాయాలై రక్తపు మడుగులో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అత్యవసర సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వైద్య సిబ్బంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న నరేష్‌ను తక్షణ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# ఈ-గవర్నెన్స్‌తోనే మెరుగైన సేవలు!

- రాష్ట్రాల సీఎస్‌లకు కేబినెట్ సెక్రెటరీ సోమనాథన్ ఆదేశం
- తమిళనాడు 'సింపుల్‌గవ్' విధానాన్ని పరిశీలించాలని సూచన
- తెలంగాణ పద్ధతులను వివరించిన సీఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, మే 18 (మనసులో మాట ప్రతినిధి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరళమైన ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టీవీ సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం ఆయన వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న 'సింపుల్‌గవ్' ఈ-గవర్నెన్స్ విధానాన్ని పరిశీలించి, ప్రజలకు సులువైన, మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని సూచించారు.

**తెలంగాణ విధానాలపై సీఎస్ వివరణ**

ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ పద్ధతులను వివరించారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా పౌర సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్‌లైన్ డాష్ బోర్డుల ద్వారా వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్, పరిశ్రమలు, విద్య, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న సేవలను ఆయన వివరించారు.

**కేంద్ర కేబినెట్ సెక్రెటరీ అభినందన**

తెలంగాణ ఈ-గవర్నెన్స్ విధానాన్ని పరిశీలించిన కేబినెట్ సెక్రెటరీ, సీఎస్ కే. రామకృష్ణారావును అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి, ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలోని ఈ-గవర్నెన్స్ పద్ధతుల్లో మార్పులు చేస్తామని సీఎస్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక సీఎస్ నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శులు యోగితా రాణా, శికా గోయల్ పాల్గొన్నారు. వీరితో పాటు సెక్రెటరీలు రఘునందన్ రావు, ఈ. శ్రీధర్, అనిత రామచంద్రన్, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య తదితరులు హాజరయ్యారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం!

**మండిపడ్డ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**వర్షాలకు తడిసి మొలకెత్తుతున్న వరి**

**కొనుగోళ్లు జరపకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక**

**వికారాబాద్, మే 18 (మనసులో మాట):** ధాన్యపు కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దీనంగా మారిందని సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం సేకరించకపోవడం వల్ల అకాల వర్షాలకు తడిసి వరి మొలకలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే రైతుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, ఇక రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# సిరిసిల్లలో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల ఘర్షణ!

**బండి సంజయ్ బర్తరఫ్‌కు డిమాండ్ చేస్తూ నిరసన**

**నిరసనకారులపై దాడికి దిగిన బీజేపీ కార్యకర్తలు**

**రంగంలోకి దిగిన ఎస్పీ మహేష్, డీఎస్పీ నాగేంద్రాచారి**



**రాజన్న సిరిసిల్ల, మే 18 (మనసులో మాట):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ అయిన నేపథ్యంలో, మంత్రిని వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమయంలో అక్కడకు చేరుకున్న బీజేపీ శ్రేణులు బీఆర్ఎస్ నేతలపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో పలువురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. బీజేపీ శ్రేణులు దాడికి దిగినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు తమ నిరసనను ఆపలేదు. బండి సంజయ్‌ను మంత్రివర్గం నుండి తొలగించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఇరువర్గాలు పోటాపోటీగా ఘర్షణకు దిగడంతో పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలు ఉద్రిక్తంగా మారాయి.


**రంగంలోకి దిగిన పోలీస్ అధికారులు**

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో జిల్లా ఎస్పీ మహేష్ బి గిత్తే, డీఎస్పీ నాగేంద్రాచారి తమ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. ఇరుపక్షాల నాయకులను అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గొడవకు దిగిన బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులను సముదాయించి అక్కడి నుండి పంపించి వేశారు. ప్రస్తుతం అక్కడ శాంతిభద్రతలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

# బీఆర్ఎస్ హయాంలో భారీ భూ కుంభకోణం!

- రియల్ ఎస్టేట్ సంస్థలకు ప్రభుత్వ భూముల ధారాదత్తం
- ఇద్దరు కలెక్టర్లపై ఆరు లక్షల కోట్ల అవినీతి ఆరోపణలు
- హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ సంచలనం

**ఎల్బీనగర్, మే 18 (మనసులో మాట):** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న భారీ భూ కుంభకోణంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు, నిఘా, దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి పెద్దల సహకారంతో ఇద్దరు కలెక్టర్లు చక్రం తిప్పి ఆరు లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.



### ఎకరం కేవలం వెయ్యి రూపాయలకే..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి శివారులోని సర్వే నెంబర్లు 627, 629, 1011, 1012, 1013, 1023, 1031, 1032 లలో ఉన్న 458 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా కట్టబెట్టారని ఆయన వివరించారు. 2022, 2023 సంవత్సరాలలో జిల్లా కలెక్టర్లుగా వ్యవహరించిన అమోయ్ కుమార్, ఎస్ హరీష్‌లు ఆ భూములను జీటీసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్, హిందూజా ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్, స్వేర్ స్పేస్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్, హోసర్ హోమ్స్ అనే సంస్థలకు ఒక ఎకరం కేవలం 1000 రూపాయల చొప్పున ధారాదత్తం చేశారని తెలిపారు.

### కోర్టు ద్వారా న్యాయపోరాటం

కలెక్టర్లు నేరుగా ఆయా సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయించారని, ఆ సమయంలో స్టాంప్ ఛార్జీలను కూడా మినహాయించారని ఆయన వివరించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థలకు కలెక్టర్ స్థాయి అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం దారుణమన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆ భూముల విలువ ఆరు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇంతటి భారీ భూకుంభకోణంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఆర్టీఐ సహాయంతో తాము సేకరించిన వివరాలతో కోర్టు ద్వారా న్యాయపోరాటం చేస్తామని రాపోలు భాస్కర్ స్పష్టం చేశారు.

# ఈఏపీసెట్‌లో బీసీ గురుకులాల హవా!

**516వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని హరిషిణి**

**అర్హత సాధించిన 3,781 మంది విద్యార్థులు**

**ప్రతిభ చాటిన విద్యార్థులకు మంత్రి పొన్నం అభినందన**

**హైదరాబాద్, మే 18 (మనసులో మాట):** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీ) విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షల్లో మొత్తం 3,781 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరిలో 5 వేల లోపు ర్యాంకులను 46 మంది, 10 వేల లోపు ర్యాంకులను 178 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హరిషిణి 516వ ర్యాంకుతో అత్యుత్తమ ప్రతిభ చాటగా, కల్పిత (1315), కే. శ్రవణ్ కుమార్ (1377), టీ. నవ్య (1692) ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ విభాగంలో మొత్తం 1,626 మంది ఎంజేపీ విద్యార్థులు అర్హత సాధించారు. వీరిలో 5 వేల లోపు ర్యాంకులను 43 మంది, 10 వేల లోపు ర్యాంకులను 122 మంది, 20 వేల లోపు ర్యాంకులను 247 మంది, 40 వేల లోపు ర్యాంకులను 703 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారు.

### ఇంజనీరింగ్ విభాగంలోనూ జోరు

ఇంజనీరింగ్ విభాగంలో బీ. అనిరుధ్ (3513), జీ. వినోద్ కుమార్ (3568), ఎన్. రుషిక్ వర్మ (4433) మంచి ర్యాంకులు సాధించారు. ఈ విభాగంలో మొత్తం 2,155 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ఇందులో 5 వేల లోపు ర్యాంకులు ముగ్గురు, 10 వేల లోపు ర్యాంకులు 56 మంది, 20 వేల లోపు ర్యాంకులు 167 మంది, 40 వేల లోపు ర్యాంకులు 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో అర్హత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకులాల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యకు, ప్రత్యేక శిక్షణకు, క్రమశిక్షణకు నిదర్శనమని వారు కొనియాడారు.ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులను మెరుగుపరిచామని, ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం రెండు 'కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్' (సీఓఈ) కేంద్రాలు మాత్రమే ఉండేవని, గత ఏడాది కొత్తగా 10, ఈ ఏడాది మరో 10 సీఓఈలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షించారు.

# ప్రమాద బాధితుల కుటుంబాలకు పరామర్శ!

**గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల బంధువుల ఓదార్పు**

**వాహనదారులు వేగం తగ్గించి జాగ్రత్తగా వెళ్లాలని సూచన**

**షేర్‌పల్లి గ్రామంలో అలుముకున్న తీవ్ర విషాద ఛాయలు**




**గజ్వేల్, మే 18 (మనసులో మాట):** గజ్వేల్ మండలంలోని పిడిచెడ్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేర్‌పల్లి గ్రామానికి చెందిన అల్లెల్లి ప్రవీణ్, అతని భార్య మృతి చెందిన విషయం తెలిసిందే. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వీరిని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ దారుణం జరిగింది. ఈ ఘోర ప్రమాదం గురించి తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇలాంటి ప్రమాదకర ఘటన జరగడం చాలా బాధాకరమని వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల పవిత్ర ఆత్మలకు భగవంతుడు శాంతిని చేకూర్చాలని ఆయన ప్రార్థించారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ నిదానంగా, అత్యంత జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అతివేగంతో ప్రయాణాలు సాగించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు తేవద్దని వాహనదారులను కోరారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే చనిపోవడంతో షేర్‌పల్లి గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. బాధితులను ఓదార్చిన వారిలో వంటేరు ప్రతాప్ రెడ్డితో పాటు గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు ఉన్నారు. అలాగే పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, రఘుపతి రెడ్డి, తోట శ్రీనివాస్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# జంట హత్యల కేసులో సంచలనం!

**అప్పులు తీర్చలేకే ఇద్దరు మహిళల హత్య**

**మరో ఆరుగురిని చంపేందుకు నిందితుల ప్లాన్**

**ఫామ్‌హౌస్‌లో తవ్వకాలు.. శవాల గుర్తింపు**

**రంగారెడ్డి, మే 18 (మనసులో మాట):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో పోలీసుల దర్యాప్తులో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. తమకు అప్పు ఇచ్చిన ఎనిమిది మందిని హతమార్చడానికి కరీమా బేగం దంపతులు, వారి బంధువు ఒకరు కలిసి ఘోర పథకం వేశారు. ఈ ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే ఇద్దరు మహిళలను దారుణంగా చంపి ఫామ్‌హౌస్‌లో పూడ్చిపెట్టగా.. తృటిలో ప్రాణాలు దక్కించుకున్న మరో ఆరుగురు మహిళలు తమకు ప్రాణహాని ఉందంటూ పోలీసులను ఆశ్రయించారు.

### అప్పు అడిగినందుకే ఘాతుకం

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన అబేదా బేగం, మహబూబ్ బీబి అదే కాలనీలో ఉండే కరీమా బేగం, రెహమాన్ దంపతులకు, వారి బంధువు నయీమ్‌కు కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలా రోజులు గడిచినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని వదిలించుకోవాలని నిందితులు నిర్ణయించుకున్నారు. డబ్బులు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబ్ బీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లారు. అక్కడ ఆమె గొంతు నులిమి హత్య చేసి, గుంత తీసి పూడ్చిపెట్టారు. ఆ తర్వాత అబేదా బేగంను కూడా అదే రీతిలో అక్కడకే తీసుకువచ్చి చంపి పాతిపెట్టారు.

### బయటపడ్డ అస్థిపంజరం, మృతదేహం

తాండూరు రూరల్ సీఐ ప్రణీత్ కుమార్ రెడ్డి, యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి, బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్ సిబ్బంది నిందితుల సమాచారంతో ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ తవ్వకాలు జరపడంతో మహబూబ్ బీ అస్థిపంజరం బయటపడింది. ఆ తర్వాత అబేదా బేగం మృతదేహాన్ని కూడా వెలికితీశారు.

### తృటిలో తప్పించుకున్న ఆరుగురు

పోలీసుల విచారణలో నిందితులు మరికొన్ని షాకింగ్ విషయాలు వెల్లడించారు. తమకు అప్పు ఇచ్చిన మరో ఆరుగురు మహిళలను కూడా చంపేందుకు ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నారు. అందుకోసమే వారిని కూడా ఫామ్‌హౌస్‌కు పిలిచారని, కానీ వారు రాకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారని తెలిసింది. ఈ జంట హత్యల ఉదంతం బయటకు రావడంతో భయాందోళనకు గురైన ఆ ఆరుగురు మహిళలు తమ రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# కారు డ్రైవర్ నిర్లక్ష్యం.. స్టాఫ్ నర్స్ మృతి!

**లి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విషాదం**

**మహబూబ్‌నగర్, మే 18 (మనసులో మాట):** కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఒక మహిళా స్కూటరిస్ట్ ప్రాణాలు కోల్పోయిన ఘోర ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న ప్రిసిల్లా (45) సోమవారం తన స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఆపి ఉన్న ఒక కారు డ్రైవర్ వెనుక వస్తున్న వాహనాన్ని గమనించకుండా అకస్మాత్తుగా కారు డోరును తెరిచాడు.కారు డ్రైవర్ అనాలోచితంగా డోర్ తీయడంతో స్కూటీపై వెళ్తున్న ప్రిసిల్లా ఆ డోరును బలంగా ఢీకొని రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె కన్నుమూశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# వీధి కుక్కలకు ఉచిత నీళ్ల తొట్ల పంపిణీ!

- జాగృతి అభ్యుదయ సంఘం వినూత్న నిర్ణయం
- మూగజీవాల దాహం తీర్చడం మన బాధ్యత
- పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ఎల్బీనగర్, మే 18 (మనసులో మాట): మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ రూపొందించిన సిమెంట్ డాగ్ బౌల్స్ (నీళ్ల తొట్లు)ను జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అధ్యక్షతన ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉచితంగా పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వెంకటేశ్వర కాలనీ గణేష్ మండపం, హుడాసాయి నగర్ కమ్యూనిటీ హాల్, నాగోల్ కమ్యూనిటీ హాల్, సాహెబ్ నగర్ డివిజన్ నాగిరెడ్డి కాలనీల్లో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.

## జీవవైవిధ్యాన్ని కాపాడాలి

నాగిరెడ్డి కాలనీలో జరిగిన కార్యక్రమంలో బీఎన్ రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కుక్కలు అత్యంత విశ్వాసమున్న జంతువులని కొనియాడారు. సృష్టిలోని ప్రతి జీవికి కనీస అవసరాలైన నీరు, ఆహారం అందిస్తూ ప్రకృతి సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత మనుషులపైనే ఉందన్నారు. వేసవిలో వీధికుక్కలకు దాహం వేసినప్పుడు నీళ్లు దొరకక అవి అసహనంతో మనుషులను కరుస్తుంటాయని, అలాంటి పరిస్థితులు రాకుండా ఈ తొట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ బౌల్స్ తీసుకున్న వారు తమ ఇంటి బయట ఉంచి నిత్యం నీళ్లు పోయాలని సూచించారు.

## సంస్కృతిలో జీవుల అనుబంధం

మన పూర్వీకులు ప్రతి దేవుడికి ఒక జంతువును, పక్షిని వాహనంగా ప్రకటించి ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటారని లచ్చిరెడ్డి గుర్తుచేశారు. కుక్కలను కాలభైరవుడిగా, దేవిగా కొలుస్తామని చెప్పారు. శివునికి నంది, దుర్గాదేవికి సింహం, అయ్యప్పకు పులిలా ప్రతి దేవునికి ఒక వాహనం ఉందన్నారు. దీనినే సైన్స్ పరిభాషలో 'బయోడైవర్సిటీ' అంటారని వివరించారు. జీవులను కాపాడుకునేందుకు ప్రభుత్వ చట్టాలు కూడా ఉన్నాయని, కుక్కలు కరవడాన్ని ప్రకృతి ఆగ్రహంగా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు గోపాల్ దాస్ రాము, రాంబాబు గౌడ్, సునీల్, సతీష్, శ్రీనివాసులు, పూల్ సింగ్, గూడూరు వెంకటేష్ గౌడ్, కే. సోమయాజులు, పద్మావతి, లక్ష్మీనారాయణ, మనోజ్, భవాని, శశికాంత్, డాక్టర్ రాము, ఆంజనేయులు, కిరణ్, దయాకర్, శృంగవరపు శ్రీనివాస్, శరత్, సత్యనారాయణ, రమణయ్య, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# యువజన క్రీడా వారోత్సవాలు ప్రారంభం!

మారథాన్‌ను ప్రారంభించిన మల్‌రెడ్డి రాంరెడ్డి

సరూర్‌నగర్ స్టేడియం నుంచి కొత్తపేట వరకు..



ఎల్బీనగర్, మే 18 (మనసులో మాట): యువజన క్రీడోత్సవాలలో భాగంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుండి కొత్తపేట్ వరకు నిర్వహించిన 5 కిలోమీటర్ల మారథాన్‌ను తెలంగాణ రోడ్డు రవాణా డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ క్రీడా పరుగులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి ఐఏఎస్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా యువజన స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ ఎస్. స్వర్ణలత, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లా రెడ్డి, పలువురు కోచ్‌లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మారథాన్‌ను విజయవంతం చేశారు.

# కారు ఢీకొని భార్యాభర్తల దుర్మరణం!

సిద్దిపేట, మే 18 (మనసులో మాట): సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ (50), జ్యోతి (45) దంపతులు. సోమవారం నాడు ఒక పని నిమిత్తం ఇద్దరు కలిసి బైక్‌పై బయటకు వెళ్లారు. గజ్వేల్ సమీపంలోని పత్తి మిల్లు వద్దకు రాగానే ఒక కారు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు దంపతులిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# విదేశీ ఉద్యోగాల పేరిట భారీ మోసం!

హైదరాబాద్, మే 18 (మనసులో మాట): మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విదేశీ ఉద్యోగాల పేరిట జరిగిన ఒక భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హాఫీజ్‌పేట్‌లోని 'సిడీ దశరథ్' కన్సల్టెన్సీ నిరుద్యోగులను నమ్మించి నిలువునా ముంచేసింది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించిన నిర్వాహకులు, బాధితుల నుండి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసి పరారయ్యారు. ఈ మోసానికి పాల్పడిన నిందితులు అర్చన, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగుల నుండి ఒక్కొక్కరి వద్ద రూ. 6 లక్షల చొప్పున వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. బాధితుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ సంస్థ చేతిలో ఇంకా ఎంతమంది మోసపోయారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# మహావీర్ జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభం!

కొత్తపేటలో ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్

సామాన్యులకు జనరిక్ మందులు ఎంతో మేలు

కొత్తపేట, మే 18 (మనసులో మాట): కొత్తపేట ఉనాగోల్ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన మహావీర్ జనరిక్ మెడికల్ స్టోర్‌ను కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ.. జనరిక్ మందులు తక్కువ ధరలకే లభించడం వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ స్టోర్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహకులు శ్రీనివాస్ రావును ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో బిజేపీ నాయకులు కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి, శరణ్ పాల్గొన్నారు.



# గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోండి!

డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ బహిరంగ లేఖ

లారీని తీసుకెళ్లిన ఎంఐఎం ఎమ్మెల్యేపై ఆగ్రహం

రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా పనిచేయాలని సూచన

హైదరాబాద్, మే 18 (మనసులో మాట): తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. శనివారం రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడికి చేరుకుని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని రాజాసింగ్ ప్రశ్నించారు.

## చట్టం అందరికీ ఒకేలా ఉండాలి



హిందువులైనా, ఎంఐఎం నాయకులైనా చట్టం అందరికీ ఒకే విధంగా వర్తించాలని రాజాసింగ్ స్పష్టం చేశారు. గోవుల అక్రమ రవాణాకు పాల్పడుతూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. కేవలం హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వంపై ప్రజల ప్రశ్నలు

గోమాతను కాపాడతామని చెప్పే ప్రభుత్వం, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఎందుకు విఫలమవుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారని రాజాసింగ్ లేఖలో పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిందేనన్నారు. ఈ వ్యవహారంపై తెలంగాణ డీజీపీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ తన లేఖ ద్వారా కోరారు.